క్లుప్తంగా

రాజాపేట మండల వ్యవసాయ అధికారి బదిలీ

రాజాపేట: రాజాపేట మండల వ్యవసాయ అధికారిణి మాధవి శనివారం భూసార పరీక్షా కేంద్రం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు బదిలీపై వెళ్లారు. గత 12 సంవత్సరాలుగా వ్యవసాయ అధికారిణిగా రైతులకు చేసిన సేవలకుగాను పలువురు మాధవిని అభినందించారు.

పీహెచ్‌సీకి ఈసీజీ మిషన్ బహూకరణ


ఈసీజీ మిషన్‌ను అందజేస్తున్న క్లబ్ సభ్యులు

రామన్నపేట: మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రేటర్ లయన్స్ క్లబ్ వారు శనివారం ఈసీజీ మిషన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పీఎంజేఎఫ్ తీగల మోహన్‌రావు మాట్లాడుతూ.. గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అశ్వినికుమార్, లయన్స్‌క్లబ్ బాధ్యులు దుబ్బాక వెంకట్‌రెడ్డి, కంకనాల పూర్ణచంద్రారెడ్డి, బండ సాగర్‌రెడ్డి, జాలె యాదగిరిరెడ్డి, గంగుల వెంకటరాజిరెడ్డి, గోద కృష్ణారెడ్డి, పూస లింగయ్య, రాపోలు భాస్కర్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

భువనగిరి: ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు అరుణ, కార్యదర్శి డాక్టర్ చావా అశ్లేష మాట్లాడుతూ.. కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. కార్యక్రమంలో సీడ బ్యూసీ చైర్మన్, క్లబ్ మాజీ పాస్ట్ ప్రెసిడెంట్ బండారు జయశ్రీ, లావణ్య, సునీత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

యాదగిరిగుట్ట: బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ శనివారం లేఖ రాశారు. బీసీలు అధికారానికి, అవకాశాలకు, అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడిన కులాలుగా మిగిలిపోతున్నారని లేఖలో పేర్కొన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో జనాభాకు తగ్గట్టు ప్రాతినిధ్యం ఉండాలని ఏళ్ల తరబడి కోరుతున్నామని, బీసీల చిరకాల స్వప్నాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

గుండాల: ఈ నెల 25న నిర్వహించనున్న ధర్మ టీచర్స్ సంఘం సన్నాహక సమావేశం కరపత్రాలను శనివారం గుండాల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ధర్మ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు మహేష్ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో సమూల విప్లవాత్మక మార్పునకు ఉపాధ్యాయులు కలిసి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ ఎర్ర సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌లో సమస్యలు వస్తే సిబ్బందిని సంప్రదించాలి

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని దాతర్‌పల్లి గ్రామంలో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఏఈ సురేంద్ర నాయుడు రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాళ్లజనగాం, జంగంపల్లి, దాతర్‌పల్లి రైతులను విద్యుత్ లైన్‌లకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ లైన్‌లో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సిబ్బందికి ఫోన్ చేయాలని, స్వయంగా ఎలాంటి పనులు చేయొద్దని సూచించారు. సమావేశంలో సబ్ ఇంజనీర్ నరేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య, లైన్‌మన్ శ్రీనివాస్, నవీన్, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

వలిగొండ : మండల కేంద్రంలోని పెన్షనర్ భవనంలో శనివారం టీపీయూఎస్ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించి, సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వైవీఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా మద్దేపూరి వెంకటేశం ఎన్నికయ్యారు.

పింఛన్‌కు ఇక్కట్లు

- 23 గ్రామాలకు పది మంది బీపీఎంలే
- పింఛన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వేడుకోలు


ఆత్మకూరులో పంపిణీ చేస్తున్న పింఛన్ డబ్బులు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలంలో ప్రతి నెలా పింఛన్‌లు అందుకోవడంలో ఆసరా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో వృద్ధాప్య పింఛన్ దారులు 1915 మంది, వికలాంగులు, 536, వితంతులు 1415, చేనేత 91, గీత కార్మిక 408 మంది, 71 మంది ఒంటరి మహిళలు ఉన్నారు. మొత్తం 4,436 మందికి ప్రతినెలా రూ.1.12కోట్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ పింఛన్లు అందించేందుకు మండలంలో మొత్తం 23 గ్రామాలకు పది మంది బీపీఎం(బ్రాంచీ పోస్ట్ మాస్టర్)లు మాత్రమే ఉన్నారు. పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే బీపీఎం వద్దకైనా వెళ్లాలి లేదంటే బీపీఎంలు ఆయా గ్రామాలకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం గ్రామాల సంఖ్యకు అనుగుణంగా బీపీఎంలు లేక పోవడంతో ఆసరా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కప్రాయపల్లి, పారుపల్లి, సర్వేపల్లి, కూరెల్ల, మొరిపిరాల, పల్లెర్ల, కొరటికల్, రహీంఖాన్‌పేట, పల్లెపహాడ్ గ్రామాల్లో బీపీఎం సౌకర్యం ఉంది. ఇటీవల పింఛన్ డబ్బుల పంపిణీలో పలువురు బీపీఎంలు అవినీతి అక్రమాలకు పాల్పడటంతో సర్వేపల్లి, పల్లెపహాడ్‌కు చెందిన బీపీఎంలను తొలగించారు.

పక్క మండలాల బీపీఎంలతో పంపిణీ

23 గ్రామాలకు 10 మంది బీపీఎంలు ఉన్నప్పటికీ కూరెల్ల బీపీఎం దగ్గరలో ఉన్న గ్రామ రాఘవాపురంలో మోత్కూరు మండలం పాలడుగు బీపీఎం, పల్లెర్ల బీపీఎం దగ్గరలో ఉన్న లింగరాజపల్లిలో వలిగొండ మండలం బీపీఎంలు పింఛన్లు పంపిణీ చేస్తుంటారు. అయితే ప్రతి నెలా సకాలంలో పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు.

అంబాలకు పోయి పింఛన్ తీసుకుంటా



సారగండ్లగూడెం గ్రామం పారుపల్లి బీపీఎం పరిధిలో ఉంటుంది. గ్రామం నుంచి పారుపల్లికి మధ్య పెద్ద వాగు ఉంటుంది. దీంతో పారుపల్లికి పోయి పింఛన్ తీసుకునే పరిస్థితి ఉండదు. పింఛన్ కోసం గుండాల మండలం అంబాలకు పోయి తీసుకుంటాం.

– అన్నెబోయిన కాశయ్య, సారగండ్లగూడెం

పోలీస్‌స్టేషన్‌పై దాడికి 18ఏళ్లు

- 2006 ఆగస్టు 18న ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌పై నక్సల్స్ మెరుపుదాడి
- ప్రాణాలు కోల్పోయిన ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుల్, హోంగార్డు


చాంద్‌పాషా, ఎస్ఐ (ఫైల్)


సుల్తాన్ మోహినోద్దీన్, ఏఎస్ఐ (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌పై నక్సల్స్ మెరుపుదాడులకు పాల్పడి నేటికి 18 సంవత్సరాలు. 2006 ఆగస్టు 18న అర్ధరాత్రి బాంబుల శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనలో ఎస్ఐ చాంద్‌పాషా, ఏఎస్ఐ సుల్తాన్ మోహినోద్దీన్, హోంగార్డు లింగయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా సిబ్బంది ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటనలో గాయపడ్డ మరో కానిస్టేబుల్ కరీం ఏడాది పాటు మంచానికే పరిమితమై మృతి చెందాడు. ఈ సంఘటన జరిగి నేటికి 18 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారిని మండల ప్రజలు స్మరించుకుంటున్నారు.

విద్యార్థులు మనోబలాన్ని పెంపొందించుకోవాలి

భువనగిరి: విద్యార్థులు మానసిక ప్రశాంతతతో పాటు మనోబలాన్ని పెంపొందించుకోవాలని సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎండీ కరీం అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల మానసిక సమస్యల నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సీక్రెట్స్ ఆఫ్ మైండ్ పవర్, మెమోరీ గేమ్‌లో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. దివ్య భారతి హైస్కూల్ హెచ్‌ఎం హరికృష్ణ పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ పనుల్లో పురోగతి లేదు


మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

మోత్కూరు: ఎన్నికల సమయంలో వాగ్దానాలే తప్ప ఎమ్మెల్యేలు ఎందరు మారినా బునాదిగాని కాల్వ పనుల్లో ఏమాత్రం పురోగతి లేదని, కాల్వ పూర్తి కోసం ప్రజా ఉద్యమాలు చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. శనివారం మోత్కూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అధ్యక్షతన మోత్కూరు, గుండాల మండలాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలు గడుస్తున్నా బునాదిగాని కాల్వ పూర్తి చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. గోదావరి జలాలను బునాదిగాని కాల్వ ద్వారా ఇచ్చేందుకు డీపీఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. రైతులు, కార్మికులు, వృత్తిదారులు, అన్ని వర్గాల ప్రజలు సాగు నీటి సాధనకు జరుగుతున్న ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, గుండాల మండల కార్యదర్శి మద్దెపురం రాజు, రైతు సంఘం నాయకులు పైళ్ల యాదిరెడ్డి, టౌన్ కార్యదర్శి కూరపాటి రాములు, దడిపల్లి ప్రభాకర్, మెతుకు అంజయ్య, పిట్టల చంద్రయ్య, పైళ్ల రామ్‌రెడ్డి, కందుకూరి నర్సింహ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి రైతాంగాన్ని కాపాడాలి

చౌటుప్పల్ రూరల్: పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థ రసాయనాల వల్ల భూగర్భ జలాలు కలుషితమై పంటలు నాశనమవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో సీపీఎం నాయకులు రైతుల బోరు బావుల నీళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశం, సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు చీరిక సంజీవరెడ్డి పాల్గొన్నారు.

క్షేత్ర సందర్శనలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు


జిల్లా కేంద్రానికి చేరుకున్న విద్యార్థినులు

భువనగిరి రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు క్షేత్రసందర్శనకుగాను జిల్లా కేంద్రానికి వచ్చారు. కళాశాల నుంచి 46 మంది విద్యార్థినులు రాగా ఏరువాక శాస్త్రవేత్తల పర్యవేక్షణలో నాలుగు నెలల పాటు భువనగిరి, మోటకొండూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ పనులపై అధ్యయనం చేయనున్నారు.

సంక్షిప్త సమాచారం

కాల్వను పూర్తి చేయాలని వినతి

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం), మోత్కూరు ప్రాంతాలకు సాగునీరు అందించే బునాదిగానికాల్వకు పూర్తిపై అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు, సీపీఐ శాసన సభ పక్షనేత కూనంనేని సాంబశివరావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, జిల్లా కౌన్సిల్ సభ్యులు జల్ది రాములు, జక్క దయాకర్‌రెడ్డి, గుర్రం రాజమణి, మండల కార్యదర్శి వెంకటేషం ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండ

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని బస్వలింగేశ్వర కాలనీకి చెందిన కర్నాటి నర్సింహస్వామి క్లోమగ్రంధి కేన్సర్‌తో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నాడు. ఈమేరకు శనివారం సాక్షి దినపత్రికలో 'నిరుపేద కార్మికుడిని ఆదుకోరూ' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన జక్క రోషిరెడ్డి రూ. 10వేలు, పోచంపల్లి పట్టణానికి చెందిన పలువురు రూ.5వేల ఆర్థిక సాయాన్ని బాధితుడికి ఫోన్‌పే ద్వారా పంపించారు.

ఆర్థికసాయం అందజేత

భువనగిరి రూరల్: చందుపట్ల పీఏసీఎస్ గ్రామ సభ్యుడు దంతూరి జంగయ్య(80) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు డివిడెండ్ ఫండ్ నుంచి రూ.30వేల ఆర్థిక సాయాన్ని సంఘం అధ్యక్షుడు మందడి లక్ష్మీనర్సింహారెడ్డి శనివారం అందజేశారు.

మత్తు పదార్థాలపై అవగాహన

గుండాల: గ్రామాల్లో ప్రజలు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సైదులు అన్నారు. శనివారం గుండాల మండల కేంద్రంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు సైదులు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి 40 ఫీట్ల వెడల్పు ఉండేలా చర్యలు చేపట్టాలి

మోత్కూరు: మోత్కూరు మున్సిపాలిటీలో ప్రధాన రహదారి వెడల్పు 40 ఫీట్లు ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోచం సోమయ్య శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. వారిలో పట్టణ ప్రధాన కార్యదర్శి చేకూరి మల్లేష్, బీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఎడ్ల రాము, బ్రిడ్జి శ్రీను తదితరులు ఉన్నారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని మద్దెలమ్మ దేవాలయ అష్టమ వార్షిక బోనాల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో మహాయజ్ఞం నిర్వహించారు. పంచముఖ హనుమాన్ విగ్రహంతోపాటు నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోశిక స్వామి, కార్యదర్శి గోశిక రవి, సహాయ కార్యదర్శి గుర్రం నర్సింహ, కోశాధికారి జిల్లా నర్సింహ, ప్రతినిధులు గోశిక రాజేందర్, నల్ల రమేష్, బాల్యం చంద్రయ్య పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకానికి దరఖాస్తుల స్వీకరణ

భువనగిరి: గృహజ్యోతి పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి శనివారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు: కరెంటు బిల్లు, గ్యాస్ సబ్సిడీ రానివారి కోసం ఎడిట్ ఆప్షన్ పెట్టినట్లు, తిరిగి మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని మోత్కూరు ఎంపీడీఓ శంకరయ్య శనివారం తెలిపారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ప్రజా పాలన దరఖాస్తు రశీదు, కరెంటు బిల్లు, ఫోన్ నంబర్, ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని కోరారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

గుండాల: మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన ఎండీ వజీర్ మద్యం సేవించి తల్లిదండ్రులను వేధిస్తున్నాడని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని శనివారం తహసీల్దార్ జలకుమారి ఎదుట బైండోవర్ చేశారు. తల్లిదండ్రులను వేదిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


భువనగిరిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

భువనగిరి: కోల్‌కత్తాలోని జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని భువనగిరి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌భార్గవ్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక వినాయక చౌరస్తా వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంతకు ముందు వినాయక చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అజయ్‌కుమార్, అనిల్‌రెడ్డి, రాజ్‌కుమార్, సుమంత్, ప్రసాద్, ప్రశాంతి, ఇందిరా పాల్గొన్నారు.

భువనగిరి పట్టణంలో శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు దీపిక మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంజన, నితిన్, పవన్ పాల్గొన్నారు.

వైద్యుల నిరసన ర్యాలీ

చౌటుప్పల్ : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ మౌమితా దేవ్‌నాథ్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం చౌటుప్పల్ సీహెచ్‌సీ, పీహెచ్‌సీలతోపాటు ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అలివేలు, సుమన్‌కళ్యాణ్, వీరన్న, సుభాషిణి, పాండురంగం, కాటంరాజు, ప్రశాంతి, శ్వేతప్రియాంక, రాజగోపాల్, అవ్వారు శ్రీనివాస్‌ప్రసాద్, నీరజ, అశ్విన్‌కుమార్, కె.రాజుచారి, వెంకటేశ్వరరావు, వేముల నర్సింహ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల నిరసన

మోత్కూరు: కోల్‌కతా మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను శిక్షించాలని శనివారం మోత్కూరులో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నా పాలకులు, అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోక భిక్షం, మండల అధ్యక్షుడు గనగాని నర్సింహ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పురుగుల రమేష్, ప్రచార కార్యదర్శి కట్టికోల యుగేందర్, గౌరవ అధ్యక్షులు ఎడ్ల యాదిరెడ్డి, రఘువర్ధన్, వైద్యులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రామన్నపేట: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన వైద్య ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం వారు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాణి, సుశీల, కవిత, శషాజియా, సబిత, పద్మ, రచిత, కొమ్ము వెంకటేష్, సత్యనారాయణ, నిర్మల, రామలింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డుల ప్రదర్శన

ఆలేరురూరల్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యచార ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ శనివారం ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ స్వప్న, నర్సులు ఊర్మిల, మంజుల, సిబ్బంది అనిత, నీరజ, మమత పాల్గొన్నారు.

నిందితులను ఉరితీయాలి

అడ్డగూడూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యచార ఘటనకుగాను శనివారం అడ్డగూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో డాక్టర్ ప్రవీన్ కుమార్, వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

భూదాన్‌పోచంపల్లి: ఇండియల్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో శనివారం ఫస్ట్ ఎయిడ్ మెడికల్ హెల్త్ అసోసియేషన్, కెమిస్ట్రి అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ వైద్యులు స్వచ్ఛందంగా వైద్యసేవలు బంద్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సూరెపల్లి ప్రమోద్, ఉపాధ్యక్షుడు గుండు అశోక్, కోశాధికారి సీత భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సూరెపల్లి బాలరాజు, ఏఎస్ నాయుడు, బి. నరేశ్‌కుమార్, మహేశ్‌కుమార్, రుషి, ఏలే హరిశంకర్, గుండు నవీన్‌కుమార్, బాలు, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశం, మండల అధ్యక్షుడు అమృతం అశోక్ పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య సిబ్బంది నిరసన

ఆత్మకూరు(ఎం): జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 24గంటలు ఓపీ సేవలు బంద్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి వంశీకృష్ణ పాల్గొన్నారు.

బీబీనగర్: కోల్‌కత్తాలో జూనియర్ వైద్య విద్యార్థిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ శనివారం బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో ఓపీ సేవలు నిలిపివేశారు. ఎయిమ్స్ నుంచి బీబీనగర్‌లోని పోచంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

రాజాపేట: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు జూకంటి ప్రవీణ్‌కుమార్, ఎంఈఎఫ్ జిల్లా ఇన్‌చార్జి ఇంజ మహేష్, ఎంఆర్‌పీఎస్ నాయకులు మోత్కుపల్లి నవీన్ అన్నారు. శనివారం రాజాపేటలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సమ్మయ్య, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు చింతల రవి, ఠాకూర్ కిషన్ సింగ్, దివాకర్, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.


మోత్కూరు: జూనియర్ డాక్టర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామీణ వైద్యులు


చౌటుప్పల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది


రామన్నపేటలో నిరసన తెలుపుతున్న వైద్య ఉద్యోగులు


ఆలేరురూరల్: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్యులు


భూదాన్‌పోచంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు


రాజాపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చిరువ్యాపారులను ఆదుకోవాలి

భువనగిరి: చిరువ్యాపారులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. భువనగిరి పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద తొలగించిన చిరువ్యాపారుల షెడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లావణ్యకు వినతి పత్రం అందజేశారు. వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సబిత, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, లక్ష్మయ్య ఉన్నారు.

30 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజు గడువు

భువనగిరి : ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ పరీక్షలు రాయాలనుకునే వారు ఈనెల 30వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని ఇంచార్జ్ డీఈఓ ప్రశాంత్ రెడ్డి శనివారం తెలిపారు. రూ.25 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4, రూ.50ల అపరాధ రుసుముతో సెప్టెంబర్ 9వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించవచ్చన్నారు. వివరాల కోసం సెల్ నంబర్ 80084 03523ను సంప్రదించాలని కోరారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు


తోటి విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్, గ్రీన్‌గ్రోవ్, చందన్ స్కూల్‌లలో శనివారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు తమ సహచర బాలురులకు రాఖీలు కట్టారు. ఆయా వేడుకల్లో పాఠశాలల చైర్మన్‌లు కేవీబీ.కృష్ణారావు, బండి వీణాఅనిల్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్లు డాక్టర్ ఉజ్జిని మంజుల, లక్ష్మి, చందన స్కూల్ ప్రిన్సిపాల్ అవ్వారు రామేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు

భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, బొమ్మలరామారం : భూదాన్‌పోచంపల్లి మండలంలోని దంతూర్ గ్రామంలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ప్రదర్శనగా వచ్చి స్వామివారికి సమర్పించారు. బీబీనగర్ మండలంలోని జైనపల్లి గ్రామంలో శ్రీకంఠమహేశ్వర స్వామికి, బీరప్ప స్వామికి బోనాలు సమర్పించారు. బొమ్మలరామారం మండలంలోని మర్యాల గ్రామంలో పెద్దమ్మతల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్ల నడుమ బోనాలను ఊరేగింపుతో తీసుకెళ్లారు.


భూదాన్‌పోచంపల్లి: దంతూర్‌లో బోనాలతో మహిళలు


బీబీనగర్: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు